క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకున్న నీలం మధు

పటాన్‌చెరు: ప్రతి రెండేళ్లకు ఒకసారి ఆషాఢ మాసంలో మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించే దుర్గమ్మ ఉత్సవాలు చిట్కుల్‌లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాల్లో మొదటిరోజు కట్ట మైసమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ నేత నీలం మధు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం దుర్గమ్మకు, గురువారం పోచమ్మకు భక్తులు బోనాలు సమర్పించనున్నారు. బుధవారం సాయంత్రం ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ఫలహారం బండి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆరూర్ గ్రామంలోని జాతీయ రహదారిపై సదాశివపేట పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. 20 మంది సిబ్బంది పాల్గొని డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరిని పట్టుకొన్నారు. మూడు నంబర్ ప్లేట్లులేని వాహనాలను సీజ్ చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఏబీవీపీ సమావేశం



పాల్గొన్న నాయకులు

నారాయణఖేడ్: పట్టణంలో ఏబీవీపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి మెదక్ విభాగ్ సంఘటన మంత్రి బోడ లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి పునర్నిర్మాణం, జాతీయ భావాలను పెంపొందించడంలో ఏబీవీపీ కృషి చేస్తోందన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. నగర అధ్యక్షుడుగా నాగ్‌నాథ్, కార్యదర్శిగా పట్లోళ్ళ యశ్వంత్‌రెడ్డిని ఎంపికచేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, పవన్, నగర పూర్వ కార్యదర్శి అనిల్, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న వీరాస్వామి

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలో నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యులు రోగులకు బీపీ, షుగర్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆసుపత్రి వైద్యులు ప్రవళిక, నిహారిక సిబ్బంది సునీత, ఓబుల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరేందర్, ఆసిఫ్, బీఆర్ఎస్ నాయకులు ఇస్మాయిల్, లింగం, ఆశయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లంబాడీ ఐక్య వేదిక ఇన్‌చార్జిగా ప్రకాశ్



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్: లంబాడీ ఐక్య వేదిక సంగారెడ్డి ఇన్‌చార్జిగా ప్రకాశ్ మంగళవారం నియమితులయ్యారు. ఎం.అశోక్ నాయక్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుల జాబితాలో చేర్చాలని ప్రకాశ్ కోరారు.

బీమా 'భరోసా'

కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండే రైతు హఠాత్తుగా మరణిస్తే ఆ కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారు. ఒక్కసారిగా కష్టాల పాలవుతారు. అలాంటి పేద కుటుంబాలను రైతుబీమా పథకం ఆదుకొని భరోసానిస్తోంది. కొత్తగా భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా బీమా పొందేందుకు అవకాశం ఉంది. - మునిపల్లి(అందోల్)



మునిపల్లిలో రైతుబీమా దరఖాస్తు తీసుకుంటున్న ఏఈఓ

గుంటభూమి ఉన్నా అర్హులే..
- ఆగష్టు 5వరకు తప్పుల సవరణ
- రూ.5లక్షలు చొప్పున మంజూరు
- రైతులు వినియోగించుకోవాలి

రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వం బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. జీవిత బీమా సంస్థతో కలిసి ప్రవేశ పెట్టిన ఈ పథకం అన్నదాత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రైతుల పక్షాన ప్రీమియాన్ని ప్రతియేటా ప్రభుత్వమే చెల్లిస్తోంది. బీమా ఉన్న రైతు ఏ కారణంతోనైనా మృతి చెందితే ఆ నామినీకి బీమా సంస్థలు లబ్ధిదారుల ఖాతాలో రూ.5లక్షలు జమ చేస్తాయి. ఆ సొమ్ము పేద రైతు కుటుంబాలకు ఆపన్న హస్తంగా మారింది.

కొత్తవాళ్లకు అవకాశం

అంతకు ముందున్న వాళ్లే కాకుండా కొత్తగా భూములు కొన్న రైతులు ఎవరైనా ఉంటే రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. భూమి పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, నామినీకి చెందిన బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత వ్యవసాయాధికారులు గ్రామాల్లో చాటింపు వేయించారు.

గుంటభూమి ఉన్నా..

ఆధార్ కార్డులో 18-59 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. కనీసం గుంట భూమి ఆపై ఎంత విస్తీర్ణం ఉనప్పటికీ లబ్ధిదారులుగా ఉండొచ్చు. దరఖాస్తు పత్రంతోపాటు రైతు పట్టదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుల వివరాలను బీమా పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు. బీమాపత్రం పొందిన రైతులు ఏ కారణం చేతనైనా మృతి చెందితే మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించిన రెండు నెలలలోపు బీమా పరిహారం జమచేస్తారు.

ఆగష్టు 5వరకు గడువు

భూమి ఉన్న ప్రతీరైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆగష్టు 5వరకు గడువు ఉందని, దీనిలో భాగంగానే క్లస్టర్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు చెప్తున్నారు.


ఇప్పటి వరకు 6,158 మందికి బీమా

జిల్లాలో రైతు బీమా ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 6,158 మందికి రూ.5లక్షలు చొప్పున బీమా సొమ్ము మంజూరు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

దరఖాస్తు చేసుకున్నా..

ఈ మధ్యనే నా పేరుమీద మా తాత కొంత భూమిని రిజిస్ట్రర్ చేయించారు. నా పేరుపై భూమి ఉంటే ఎంతో ధైర్యంగా ఉంది. రైతు బీమా కోసం వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తు చేసుకున్నా.
- అవినాష్‌రెడ్డి, రైతు, తాటిపల్లి

రైతులంతా బీమా చేసుకోవాలి



కొత్త పట్టాదారు పాసు పుస్తకం పొందిన ప్రతి రైతు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, నామినీ బ్యాంకు పాస్ బుక్ సంబంధిత అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని భూమి ఉన్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.
- అంబికాసోని, జిల్లా వ్యవసాయాధికారి

చెక్‌డ్యామ్‌ల్లో జలకళ



సీతారామ్‌తండాలోని చెక్ డ్యామ్‌లో చేరిన నీరు

సీతారామ్‌తండా శివారులో రూ.5 లక్షలు వెచ్చించి చెక్ డ్యామ్ నిర్మించారు. ఆకలాయి తండా శివారులోని చెక్ డ్యామ్‌కు రూ.లక్షతో మరమ్మతులుచేసి నీరు నిల్వ ఉండేలా పునరుద్ధరించారు. దీంతో ప్రస్తుతం కురిసిన వర్షాలకు నీరుచేరి ఆ చెక్ డ్యామ్‌లు కళకళలాడుతున్నాయి. పలువురు నేతలు ఆయా డ్యామ్‌లను మంగళవారం పరిశీలించారు. నీరు పుష్కలంగా చేరడంతో భూగర్భజలాలు పెరుగుతాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. - నారాయణఖేడ్

మహిళల అభివృద్ధికి ప్రత్యేక రుణాలు

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం మహిళా శక్తి పథకంద్వారా ప్రత్యేక ఋణాలు ఇవ్వాలని ఆదేశించినట్లు కలెక్టర్ క్రాంతి చెప్పారు. మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య 82వ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు అన్ని విధాలుగా ఎదగాలన్నారు. వెటర్నరీ విభాగంలో పాడి గేదెల పెంపకం, డైరీఫారమ్ ఏర్పాటు, కోళ్ల ఫారాలు, క్యాంటీన్లు, ఆహార శుద్ధి యూనిట్లు, పాలకేంద్రాల ఏర్పాటు లాంటి పథకాలు ఉన్నట్లు తెలిపారు. మహిళలు ఋణాలు తీసుకొని ఆయా యూనిట్లను ఏర్పాటుచేసి సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అందుకోసం డీఆర్డీఏ అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తారని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో పీడీ, డీఆర్‌డీఏ జ్యోతి, అదనపు డీఆర్‌డీఏ జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంది(సంగారెడ్డి): చిమ్నాపూర్‌లో బోనాల ఊరేగింపు

ఉత్సాహంగా బోనాలు

ఆషాఢమాసం చివరి మంగళవారాన్ని పురస్కరించుకుని పలు మండలాల్లోని గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించారు. దుర్గమ్మ, పోచమ్మ, ఎల్లమ్మలాంటి గ్రామదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో బోనాల ఊరేగింపులు సాగాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని బోనాలు సమర్పించుకున్నారు.



సంగారెడ్డి టౌన్: బోనాలతో వస్తున్న మహిళలు



ఝరాసంగం (జహీరాబాద్): తరలి వస్తున్న భక్తులు



సంగారెడ్డి రూరల్: హస్తులపూర్‌లో..



జహీరాబాద్: శేఖాపూర్‌లో

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సీఐటీయూ జిల్లా నేత నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ నేపథ్యంలో పోలీసులు ఉదయం 5గంటలకే సీఐటీయూ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని భగ్నం చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు, ఆశా కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చిందని, ఇప్పుడు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విఫలమైన ప్రభుత్వం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ధోరణి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్: ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాదుకు వెళ్తున్న నాయకులను పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదగిరి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీపాల్గొన్నారు.

ఆరుగురు వైద్యులు బదిలీ

జహీరాబాద్: జహీరాబాద్‌లోని వైద్య విధాన పరిషత్‌కు చెందిన ఆరుగురు వైద్యులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇద్దరు కొత్తగా వచ్చి చేరారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న శేషుబాబు, నాగరాజ్‌పాటిల్, బాల్‌రాజ్, రమాప్రియ, నితిన్, శ్రీధర్‌రెడ్డి బదిలీ అయ్యారు. వారిలో నలుగురు మంగళవారం రిలీవ్ అయ్యారు. వారి స్థానంలో జోగిపేట నుంచి రమేశ్, భద్రాచలం నుంచి సుమన్ ప్రవీణ బదిలీపై వచ్చారు. మిగతా వారు మరో రెండు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది. 36వైద్యులకు గాను ఆస్పత్రిలో 17మంది వైద్యుల పోస్టులు కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఇద్దరు వైద్యులు రిజైన్ చేశారు. మరో ఐదుగురు సెలవులో ఉన్నారు. సెలవులో ఉన్నవారు బుధవారం విధుల్లోచేరే అవకాశం ఉన్నట్లు బాధ్యులు పేర్కొన్నారు.

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న ఈఎంటీ

నారాయణఖేడ్: ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరిన ఓ మహిళకు ప్రసవం కష్టతరం కావడంతో 108అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలిస్తుండగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మార్డాడిగల్లికి చెందిన నిఖిత ప్రసవం కోసం ఆదివారం ప్రాంతీయ ఆసుపత్రిలో చేరింది. అయితే శిశువు తలకు పేగు చుట్టు కుని ఉందని గుర్తించిన వైద్యులు ఆమెను సోమవారం రాత్రి జిల్లాకేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. అంబులెన్స్‌లో తీసుకెళుతుండగా అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

అర్హుల ఇళ్లు క్రమబద్ధీకరించండి

బీజేపీ నాయకుల ధర్నా



దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

పటాన్‌చెరు: జీవో 59కింద డబ్బులు చెల్లించిన అర్హుల ఇళ్లను వెంటనే క్రమబద్ధీకరించాలని బీజేపీ బొల్లారం పట్టణశాఖ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద బాధితులతో కలిసి ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పేద ప్రజలు తమ ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం అప్పులు చేసి డీడీలు కట్టారని, క్రమబద్ధీకరణ చేయకపోవడంతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో మున్సిపల్ కార్యాలయం నుంచి జిన్నారం వరకు పాదయాత్రచేసి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామని అయినా న్యాయం జరగలేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో బాధితులు పంచాయతీ కార్యాలయం ఎదుట ఐలేశ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టి.మేఘనారెడ్డి, డి.స్రవంతి రెడ్డి, టి.రవీందర్ రెడ్డి, జి.రాఘవేంద్రరెడ్డి, బి.రాజు, శివ లక్ష్మణ్, వి.శ్రీకాంత్‌చారి, దిలీప్ కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఐఎన్‌టీయూసీ జిల్లా నేత నరసింహారెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ చేసిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సుమారు 31వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించి ఇప్పటికే 12వేల కోట్లను రుణమాఫీ చేశారన్నారు. మిగతా బకాయి ఆగస్టులో చేస్తారని చెప్పారు. అదేవిధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పదివేల కోట్లు, కార్పొరేషన్‌కు రూ.3,500కోట్లు, జలమండలికి రూ.3,300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సమ్మయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలీక్, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

1,282 మందికి రైతు రుణమాఫీ



ఝరాసంగంలో వీక్షిస్తున్న అధికారులు, రైతులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో 1,282 మందికి రూ.1.50లక్షల లోపు ఉన్న రైతులకు రెండో విడత రుణమాఫీ నిధులు విడుదలైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. మండల పరిధిలోని బర్దిపూర్ రైతు వేదికలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, నాయకులు, రైతులు వీక్షించారు. కార్యక్రమంలో ఝరాసంగం పీఏసీఎస్ చైర్మన్ గౌసొద్దీన్, ఏఈఓలు సుకుమార్, వినోద్ కుమార్, సంపత్ కుమార్, శివప్రియ, వేణుగోపాల్ రెడ్డి, రమేశ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


గౌంగ్లూర్‌లో సంబురాలు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని గౌంగ్లూర్ రైతువేదికలో రైతులు రెండో విడత రుణమాఫీ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్.రామచంద్రారెడ్డి, ఏఈఓ మనీష పాల్గొన్నారు.

జూకల్ రైతు వేదికలో..

నారాయణఖేడ్: రెండో విడత రుణమాఫీ సంబురాలను మండల రైతులు ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు జూకల్ రైతు వేదిక వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సీఎం రెండో విడత రుణమాఫీ ప్రారంభ కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులు ఆసక్తిగా తిలకించారు. జిల్లా వ్యాప్తంగా 27,249 మందికి రుణమాఫీ కానుందని అధికారులు తెలిపారు. రైతులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



వివరాలు నమోదు చేస్తున్న అధికారి

పటాన్‌చెరు టౌన్: బీరంగూడ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. స్థానిక వ్యక్తి సిద్ధార్థ మంగళవారం ఆ టిఫిన్ సెంటర్ నుంచి టిఫిన్ తీసుకెళ్లాడు. పార్సిల్ విప్పి చూడగా చట్నీలో పురుగులు కనిపించాయి. దీంతో హోటల్ నిర్వాహకుడిని అడిగినా స్పందించకపోవడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రాష్ట్ర స్థాయి అధికారి శ్రీశిక టిఫిన్ సెంటర్‌ను పరిశీలించారు. చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

తుర్కాపల్లిలో పట్టపగలు చోరీ

- 5తులాల బంగారం, 70తులాల వెండి అపహరణ

నారాయణఖేడ్: తాళం వేసిఉన్న ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు బంగారం, నగదును అపహరించిన ఘటన తుర్కాపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ అంజిగౌండ భార్య శారద ఇంటికి తాళంవేసి పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి బీరువాలోని 5తులాల బంగారం, 70 తులాల వెండి, రూ.32వేల నగదును అపహరించినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ అప్రమత్తంగా ఉండండి

పటాన్‌చెరు టౌన్: చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం పాశమైలారంలో రైజ్ రాప్టర్ అసోసియేషన్ అభివృద్ధి చేసిన రైజ్ యువర్ వాయిస్ కామిక్ పుస్తకాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు జాకీర్ హుస్సేన్ షేక్ విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి వివరించారు. ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, టీచర్లకు తెలపాలని సూచించారు.

◆ లయన్స్ క్లబ్ అన్నదానం

జోగిపేట(అందోల్): స్థానిక డబుల్ బెడ్రూం కాలనీ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 120మందికి పైగా పేదలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు వీరహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 80 మందికి పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనంతరెడ్డి, ఆకుల రాంబాబు, అల్లె శ్రీకాంత్, జి.సంతోష్‌కుమార్, ఎం.జగన్మోహన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, పి.సంతోష్‌కుమార్, మల్లేశం, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

◆ విద్యార్థుల కోసం కృషి

నారాయణఖేడ్: మండలం ర్యాకల్ ఉన్నత పాఠశాల ఆకతాయిలకు అడ్డాగా మారడంతో ఎస్ఆర్‌వి గ్రూప్ మశ్చందర్ తన సొంత నిధులతో శుభ్రం చేయించారు. క్రీడామైదానాన్ని జేసీబీతో చదును చేయించారు. పాఠశాలకు వెళ్లే రోడ్డుపై గోతులు పూడ్చి వేయించారు. దీంతో విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు అభినందన సభ నిర్వహించారు. లక్ష్మీబాయి, రవీందర్‌నాయక్, పండరియాదవ్, మారుతి పాల్గొన్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం రాంరెడ్డిపేటకు చెందిన రమేశ్(27) బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 10మందికి రూ.2వేలు చొప్పున జరిమానా, మరో ముగ్గురికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అది, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులు 13మందిని పట్టుకున్నారు. మంగళవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి తీర్పు వెలువరించారు.